సాక్షి
నారాయణపేట
ఆదివారం 8 జనవరి 2023



యురేనియం కలకలం

నల్లమలలో యురేనియం పరిశీలనకు బోరు డ్రిల్లింగ్ చేపట్టడంతో కలకలం రేగింది.

వివరాలు 10లో ▸



గుప్పుమంటున్న సారా

అటవీ సమీప గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా సారా తయారీ జోరుగా సాగుతుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.4 /14.1

రోజంతా చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రికి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

తెల్లకందులు క్వింటాల్ రూ.8,229

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం తెల్లకందులు క్వింటాల్ గరిష్టంగా రూ.8,229, కనిష్టంగా రూ.6వేలు, ఎర్ర కందులు క్వింటా గరిష్టంగా రూ.8,109, కనిష్టంగా రూ.6,610, వరి ధాన్యం సోనామసూరి క్వింటా గరిష్టంగా రూ.2,435, కనిష్టంగా రూ.1,820, హంస గరిష్టం, కనిష్టంగా రూ.1,960 పలికింది. జిల్లాలోని కాటన్ మిల్లులో పత్తి క్వింటాకు గరిష్టంగా రూ.8,600, కనిష్టంగా రూ.5వేలు పలికాయి.

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి



ఊట్కూరు: మండలంలోని తిప్రాసిపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి అన్నారు. శనివారం తిప్రాసిపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా ఆమె సందర్శించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రహదారి వెంట బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకున్నా ప్రజలకు అవగాహన లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి రోడ్ల వెంట బహిరంగ మలమూత్ర విసర్జన నిలిపివేసేలా కృషి చేయాలని కోరారు. నర్సరీలో మొక్కలపై అధికారులు శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జావెద్, స్థానికులు రాములు, రాజు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు

నారాయణపేట రూరల్: ఆపరేషన్ స్మైల్ పోలీసు బృందాలు శనివారం నారాయణపేట పట్టణంలో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌షాప్, హోటళ్ల, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న 8మంది బాలకార్మికులను గుర్తించారు. వెంటనే వారిని నారాయణపేట సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. తదుపరి పిల్లలు, వారి తల్లిదండ్రులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు ఎస్పీ చెప్పారు. దుకాణ యజమానులను జరిమానా విధిస్తామని చెప్పారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే డయల్ 100కు కాల్ చేసి తెలియజేయాలన్నారు.

వర్చువల్ మీటింగ్‌కు బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం వర్చువల్ ద్వారా నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెర ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతపై చర్చించారు. అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని, అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్‌లో కమలం అభ్యర్థికి అత్యధిక ఓట్లను సాధించి పెడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ పాండురెడ్డి, జిల్లా అధ్యక్షులు పీ.శ్రీనివాసులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పెంపు

నారాయణపేట రూరల్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ చదవాలనుకునే అభ్యర్థులు ఈ విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీని పెంచినట్లు టాస్ జిల్లా కోఆర్డినేటర్ యదయ్యశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ అడ్మిషన్ పేరుతో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అపరాద రుసుంతో ఫీజు చెల్లించాలని తెలిపారు. టీఎస్ ఆన్‌లైన్, మీ సేవలో సంబంధిత పత్రాలతో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్షరం వైపు అడుగులు

జిల్లాలో కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్

- ఈనెలాఖరు వరకు కొనసాగనున్న కార్యక్రమం
- ఇప్పటి వరకు 643మంది చిన్నారులకు విముక్తి



సంవత్సరం	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం
2019	53	106	159
2020	75	--	75
2021	125	61	186
2022	57	166	223

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా.. ఆ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా యేటా రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాలకార్మికుల గుర్తింపు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాలలను పనిలో నుంచి బడికి పంపి వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపుతోంది.

నారాయణపేట రూరల్: జిల్లాలో పోలీసు శాఖ, చైల్డ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్, కార్మిక తదితర శాఖల అధికారులు బాలకార్మికుల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. బాల కార్మికులను గుర్తించి, వారిని పనిలో పెడుతున్న తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు.

2017 నుంచి అమలు..

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2017 నుంచి అమలుచేస్తోంది. స్థానిక పిల్లలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలను పాఠశాలకు పంపకుండా పనిలో పెట్టుకోవడం తరుచూ కనిపిస్తుంది. భాషా సమస్య కారణంగా ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల కూలీలు తమ పిల్లలను బడికి పంపడంలేదు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో బీదరికంలో మగ్గుతున్న కుటుంబాలు పిల్లలను స్కూల్‌కు పంపకుండా పనిలో పెడుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి పిల్లలను దగ్గరలోని పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమం కొనసాగిస్తు వస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 643మంది చిన్నారులకు బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించారు.

చట్టప్రకారం చర్యలు..

బాల కార్మికులకు సంబంధించి కేసులు నమోదు చేసే అంశాల్లో రెండు రకాల చట్టాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 18ఏళ్లలోపు బాలలు వారు పని ఆధారంగా సాధారణ, ప్రమాదకర కేటగిరీలుగా విభజించి కేసులు నమోదు చేస్తారు. 14ఏళ్ల లోపు చిన్నారులు అయితే బాండెడ్ లేబర్ యాక్ట్, 18ఏళ్లలోపు వారికి ప్రోబేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం చర్యలు చేపడుతారు. తీవ్రత ఆధారంగా చర్యలు ఉంటాయి. బాలల హక్కులకు ఎలాంటి భంగం కలిగిన చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు సంప్రదించవచ్చు. తద్వారా సంబంధిత డీసీపీయూ అధికారులకు సమాచారం చేరుతుంది. వివరాలు గోప్యంగా ఉంచుతారు.

తొమ్మిదో విడత ప్రారంభం..

బాలకార్మికులను గుర్తించి వారిని పని నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఆపరేషన్ చేపడుతుంది. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో సైతం 9వ విడత కార్యక్రమం ఈనెల 1న మొదలైంది. నెలాఖరు వరకు కొనసాగనుంది. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పని ప్రదేశాలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, దుకాణాలు తదితర గుర్తించిన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. పిల్లలను డీసీపీఓకు అప్పగించి వారి పేరెంట్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు.

సత్ఫలితాలు ఇస్తున్నాయి



బాల్యాన్ని ఆనందంగా స్వీకరించేలా తగిన చర్యలు చేపడుతున్నాం. పిల్లల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. వివిధ శాఖల సమన్వయంతో ఏటా రెండు నెలలు ఆపరేషన్ చేపట్టి బాలలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, యజమానులకు జరిమానాలు విధిస్తున్నాం. జనవరి నెలాఖరు వరకు నిర్వహించే కార్యక్రమంతో మరింత సత్ఫలితాలు రానున్నాయి. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి బాలకార్మికులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– ఎస్పీ వెంకటేశ్వర్లు

పనులు వేగంగా పూర్తి కావాలి

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శనివారం మండలంలోని గున్ముక్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల గోడలకు వేసిన పేయింట్ నాణ్యతగాలేదని, మళ్లీ వేయించాలని ఏఈకి సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల చుట్టూ నిర్మించాల్సిన ప్రహరీ నిర్మాణ పనులు ఎందుకు జరగడంలేదని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, ఇది తన స్థలం అని.. మీరు కంపౌండ్ వాల్ ఎలా కడతారని ప్రశ్నించారని, దీనిపై కోర్టులో కేసు వేస్తామని బెదిరిస్తున్నారని సర్పంచ్ చంద్రప్ప తెలిపారు. స్పందించిన కలెక్టర్. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎవరైనా తన స్థలం అని వస్తే కలెక్టర్ కార్యాలయానికి డాక్యుమెంట్లతో రావాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఈఈ రాంచందర్, డీఈ, ఏఈ ఉన్నారు.



గున్ముక్ల ఉన్నత పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభించాలని సూచిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

జిల్లాకు 130 పంచాయతీ భవనాలు

- పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష
- దగ్గరుండి అభివృద్ధి పనులు పూర్తి చేయించాలి
- బిల్లులు త్వరగా పెట్టాలని ఏఈలకు ఆదేశం

నారాయణపేట/ నారాయణపేట రూరల్: జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ శాఖ దృష్టి సారించి త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రణాళిక విభాగం ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు ఏ స్థాయిలో ఉన్నాయని ప్రశ్నించారు. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల అదనపు గదులు, కానుకుర్తిలో లైబ్రరీ పనులను త్వరగా చేపట్టాలన్నారు. డీఎంఎఫ్‌టీ పనులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా అని సీపీఓను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్‌సెంటర్ల నిర్మాణ పనులపై ఆరాతీశారు. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని పనులు త్వరగా పూర్తి చేసి బిల్లులు పెట్టాలని ఏఈలను ఆదేశించారు. పీహెచ్‌సీల నిర్మాణ పనులు మండలాల వారీగా పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాకు 130 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు అయ్యాయని , వాటికి త్వరలో సైట్‌లు పరిశీలించి ఈజీఎస్ ఆన్‌లైన్‌లో ఎస్టిమేట్ జనరేట్ చేయాలని ఆదేశించారు. మన ఊరు మన బడి పనులు జరగని గ్రామాల్లో మొదటి ప్రాధాన్యం ఇచ్చి పనులు ప్రారంభం చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఈఈ నరేందర్, సీపీఓ గోవిందరాజులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణను నేర్చుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక గురుకుల పాఠశాల కేంద్రంలో జిల్లాలోని టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన వచ్చింది. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్తంగా ప్రశ్నాపత్రాన్ని రూపొందించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. టాపర్లకు ట్యాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేశారు. ఇందులో తెలుగు మీడియం విభాగంలో శిరీష (చిన్నపొర్ల), కవిత (చిన్నపొర్ల), పూజ (దామరగిద్ద) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో అరవింద్ (మరికల్), చెన్నకేశ్వరి (పీహెచ్‌ఈఎస్, నారాయణపేట), అక్షయ (కేజీబీవీ, మరికల్) బహుమతులు గెలుపొందారు. ఈ మేరకు కలెక్టర్ వారిని అభినందిస్తూ మెమెంటో, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఫోరం నాయకులు రవికుమార్, కనకప్ప, నర్సప్ప, రెడ్డప్ప, నర్సింహ, అనిల్, వెంకట్రాములు, రాములు, లక్ష్మణ్, భీంసేన్, కాశప్ప, విష్ణువర్ధన్, మాధవి, శ్రీనివాస్, అయ్యప్‌రెడ్డి, బాలరాజు, పద్మ పాల్గొన్నారు.

‘మన బడి’ పనుల పరిశీలన

ఊట్కూరు/ నర్వ: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శనివారం బిజ్వార్‌లో ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. మన ఊరు–మన బడి పనులు వంటగది, డైనింగ్ హాల్ తదితర పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం 10వ తరగతిలో తెగులు పాఠ్యాంశంపై పలు పద్యాలను అడిగి వాటి అర్థాలను విద్యార్థుల నుంచి రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకోవాలని 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించాలని కోరారు. గతంలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధనుంజయ, ఉపాధ్యాయులు ఆనంద్, వెంకట్‌రెడ్డి, రవికుమార్, మనోహర్ పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని డీఈఓ గోవిందురాజులు అన్నారు. శుక్రవారం నర్వ ప్రాథమిక పాఠశాల, నర్వ కస్తూర్బా పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్సీలో ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్‌పై భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్లభాషలో కథలు చెప్పడం, పరీక్షలు రాయడంపై మండల స్థాయి పోటీల నిర్వహించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఇంగ్లిష్‌పై సులభంగా పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని చెప్పారు. ఈ పోటీలలో మండల స్థాయి విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ కాంపిటీషన్స్‌లను 8, 9 తరగతులకు జిల్లాస్థాయిలో ఈనెల 22న, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 13న పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొనాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్లభాషోపాధ్యాయులు బషీర్‌అహ్మద్, హెచ్‌ఎం మల్లేష్, సీఆర్పీలు నర్సిములు, రోజా పాల్గొన్నారు.



బిజ్వార్‌లోని పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట రూరల్: కోర్టులో కేసుల వాదనకు సొంతంగా లాయర్‌ను పెట్టుకోలేని వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. చిన్న వయస్సులో తెలియక తప్పులు చేసి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, వ్యసనాలకు బానిస కావడంతోనే నేరప్రవృత్తి పెరుగుతుందన్నారు. పేదలు న్యాయం కోసం కోర్టుకు వెళ్లే సమయంలో లాయర్‌ను సొంతంగా పెట్టుకోలేని పరిస్థితి ఉంటే, వారికి న్యాయ సేవాధికార సంస్థ సహకారం అందిస్తుందన్నారు. గ్రామీణులకు ఈ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. పోక్సో యాక్ట్, మహిళా, బాల కార్మిక చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నందునామాజి, రఘువీర్‌యాదవ్, కరస్పాండెంట్ కిరీటి, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల గృహ సందర్శన..

పట్టణంలోని వయోవృద్ధుల గృహాన్ని శనివారం ఉదయం సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్ ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిలతో మాట్లాడారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు, వివాహ చట్టంపై అవగాహన కల్పించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్


నేరస్తులకు తగిన శిక్ష పడేలా చూడాలి: ఎస్పీ

నారాయణపేట రూరల్ : కోర్టులో చార్జీషీట్ వేసిన ప్రతీ కేసులోని నిందితులకు తప్పకుండా శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోర్టు, మెడికల్, ఎఫ్ఎస్ఎల్ అధికారులతో సమన్వయం చేసుకుని కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తులకు శిక్షలను చేసి భయం వేయాలన్నారు. బాధితులకు వంద శాతం న్యాయం చేసేలా చర్యలు ఉండాలన్నారు. రాబోవు రోజుల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించాలన్నారు. అనంతరం కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్, ఇన్వెస్టిగేషన్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. సాక్షులు, నిందితులను కోర్టుకు హాజరుపరిచే విధానం, సకాలంలో కేసులు పూర్తయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభినయ్, సీఐలు రవిబాబు, జనార్దన్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పని!

కోస్గి మున్సిపాలిటీలో అధికారుల తీరిది

- పాత ఇళ్ల పేరు మార్పిడికి నిబంధనల పేరుతో అధికారుల చేతివాటం
- రాష్ట్ర మున్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలున్నా అమలుకునోచని వైనం



అధికారి జారీ చేసిన జీఓ కాపీ



కోస్గి: కొత్త మున్సిపల్ చట్టాన్ని అడ్డం పెట్టుకుని పుర అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తరాలుగా ఉన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కావాలని అడుగుతుండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడిన కోస్గి మున్సిపల్ పరిధిలో 5,893 ఇళ్లు ఉన్నాయి. వీటిలో 90శాతం కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించినవి. తాతల తర్వాత తండ్రులు, తండ్రుల తర్వాత కొడుకులు అనుభవిస్తున్న ఆస్తులివి. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి నంబర్ ఆధారంగా యజమాని పేరుతో ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు, ఇతర పంచాయతీ బిల్లులు చెల్లించడం, యజమానులు చనిపోయిన వారి పేరుతోనే బిల్లులు చెల్లిస్తున్న బాధితులు సైతం ఉన్నారు. ఇలాంటి ఆస్తులకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండవు. ఇళ్లు అమ్మిన, కొనుగోలు చేసిన ఓ బాండ్ పేపర్‌పై రాసుకొని పంచాయతీలో పేరు మార్పిడి చేయించుకోవడం కొనసాగింది. కానీ మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన కోస్గి పట్టణంలో ఇళ్లకు సంబంధించిన పేరు మార్పిడి పెద్ద సమస్యగా మారింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లోనే ఈ సమస్య ఉంది. సాదాబైనామాల పేరుతో బాధితులు నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కేవలం కోస్గి పట్టణంలోనే అధికారికంగా 750 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేరు మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు.

మార్చుకునే అవకాశం ఉన్నా..

కోస్గి మున్సిపల్ పరిధిలో ఉన్న పాత ఇళ్ల సమస్యపై మున్సిపల్ అధికారులు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై మున్సిపల్ చైర్మన్ మ్యాకల శిరీష, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి గతంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో స్పందించిన మంత్రి సంబంధిత శాఖ అధికారులకు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్ 4న రాష్ట్ర మున్సిపల్ కార్యనిర్వహణ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ఓసీ నంబర్ 366837/2021/ ఎం1 పేరుతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. 750 ఇళ్లకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి వాస్తవికంగా ఉన్న వారి పేర్లను మార్చుకోవచ్చునని కమిషనర్‌కు పూర్తి అధికారం ఇస్తున్నట్లు ఆ జీఓలో స్పష్టంగా సూచించారు. కానీ స్థానిక మున్సిపల్ అధికారులు అక్రమంగా డబ్బులు తీసుకొని పేర్లు మారుస్తున్నారు. ఇందుకు కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను నియమించారు. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.15వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరు కౌన్సిలర్లు కూడా డబ్బులిచ్చి పేరు మార్పిడి చేయించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ముట్టడి చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ రావును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కోస్గి మున్సిపల్ సమాచారం..

మొత్తం ఇళ్లు 5,893	జనాభా (2011 ప్రకారం) 21,318
రెవిన్యూ వార్డులు 5	పేరు మార్పిడి దరఖాస్తులు 758



మున్సిపల్ కార్యాలయం, కోస్గి

బుకాయిస్తున్నారు..



పాత ఇళ్ల పేరు మార్పిడి విషయంపై స్థానిక అధికారులను ఎన్నిసార్లు అడిగినా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. ముఖం చాటేస్తున్నారు. లోపల డబ్బు తీసుకుని పేరు మార్పిడి చేస్తున్నారు. ఆదేశాలు ఉన్నా అక్రమాలు ఆపడంలేదు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– మంజుల, కౌన్సిలర్, కోస్గి

అధికారులు చేయడం లేదు..



మున్సిపాలిటీల పరిధిలో ఇళ్ల పేరు మార్పిడి పెద్ద సమస్యగా మారింది. నిబంధనల పేరుతో అధికారులు చేయడం లేదు. ప్రజలకు మేం సమాధానం చెప్పుకోలేకపోతున్నాం. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలి.

– ఇద్రీస్, కౌన్సిలర్, కోస్గి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ చెందిన కొమ్ము మల్లయ్య(48) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ శనివారం తెలిపారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా డిసెంబర్ 31న ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి వికటించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య జయమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఉదండాపురంలో..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోకారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డె నర్సింహులు (30) మనస్తాపంతో శుక్రవారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి తిమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్య

మానవపాడు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంఘటన శనివారం మండలంలోని జల్లాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్లాపురం చెందిన మంగలి రాజు(33) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఆయన మానసికస్థితి బాగా లేనందున శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులో గల ఆర్డీఎస్ కాల్వ సమీపంలో పురుగు మందు తాగి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందాడు. సంఘటనపై భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మానవపాడు: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బొలెరో వాహనంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సీతు (27) వెళ్తున్నాడు. కాగా మండలంలోని బోరవెల్లి శివారులో జాతీయ రహదారిపై బొలెరో వాహనం టైరు పంక్చర్ కావడంతో దాన్ని మారుస్తున్నాడు. వెనుక వైపు నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొనగా సీతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అలంపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో పాఠశాలలో విధులు నిర్వర్తించే కంప్యూటర్ ఆపరేటర్ అసభ్యంగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. గతంలోనూ ఆ వ్యక్తి ఇలాగే ప్రవర్తించినప్పటికీ పాఠశాలలోనే కొనసాగించారు. ఈ విషయమై పాఠశాల కరస్పాండెంట్‌ను వివరణ కోరగా విషయం వాస్తవమేనని, విధుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

యువతి అదృశ్యం

బాలానగర్: మండలంలోని సూరారం చెందిన యువతి శనివారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు.

విద్యుత్‌స్తంభం ఎక్కి వ్యక్తి హల్‌చల్

- గంటపాటు సరఫరా నిలిపివేత

కల్వకుర్తి టౌన్: మద్యం మత్తులో వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో వాసవీనగర్‌కు చెందిన వెంకట్ రెడ్డి మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కటంతో పట్టణంలో దాదాపుగా గంటపాటు సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతనిని సముదాయించి కిందకు దించారు. ఇదే విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఇతను గతంలో పలుమార్లు ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని, అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవటంతో ఇలా చేశాడని ఎస్ఐ తెలిపారు.

కేబుల్ వైర్ల చోరీ



ధరూరు: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని జాంపల్లి శివారులోని నెట్టెంపాడు కెనాల్ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను శుక్రవారం అర్ధరాత్రి తీసుకెళ్లారు. దాదాపు 20 మోటార్ల వైరును దొంగతనం చేశారు. పొలాలకు నీళ్లు పారించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

మళ్లీ గుప్పుమంటున్న సారా



నాటుసారాతో పట్టుబడిన వారితో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

- నల్లమల అటవీ గ్రామాల్లో జోరుగా తయారీ
- టార్గెట్లు, అవసరాలకు మాత్రమే దాడులు
- మామూళ్ల మత్తు వదలని అధికారులు

అచ్చంపేట: జిల్లాలోని అటవీ గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా జోరుగా నాటుసారా తయారీ జరుగుతోంది. ఎక్సైజ్‌శాఖ ప్రస్తుతం చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న గుడుంబా తయారీ, విక్రయాలు చాపకింద నీరులా మళ్లీ జోరందుకున్నాయి. దీనిని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుని తయారీదారులు రాత్రికి రాత్రి రిటేయిలర్స్‌కు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రం నుంచి బెల్లం దిగుమతి అవుతుండగా స్థానికంగా పటిక లభిస్తోంది. ఫలితంగా అటవీ గ్రామాల్లో గుడుంబా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. జిల్లాలోని అచ్చంపేట, లింగాల, అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల, బల్మూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లో ఎక్కువగా గుడుంబా తయారుచేస్తున్నారు. స్థానిక స్మగ్లర్లు వివిధ ప్రాంతాల నుంచి బెల్లాన్ని తీసుకొచ్చి తయారీదారులకు దిగుమతి చేస్తున్నారు. ఇందులో ఆయా మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు హైదరాబాద్, దేవరకొండ, కర్ణాటక రాష్ట్రాల నుంచి బెల్లాన్ని కొనుగోలు చేసి వివిధ వాహనాల్లో తీసుకొచ్చి రహస్య ప్రదేశాల్లో నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి నల్లమల ప్రాంతంలోని చోటా స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. జిల్లాకు బెల్లం వివిధ ప్రాంతాల నుంచి వస్తుండగా పటికను గుట్టుచప్పుడు కాకుండా కొందరు స్థానిక కిరాణా వ్యాపారులు విక్రయిస్తున్నారు. సారా తయారవుతున్న తండాలు, గ్రామాల గురించి ఎక్సైజ్ అధికారులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నెల టార్గెట్‌ల కోసం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దాడులు నిర్వహిస్తున్నాం..

గుడుంబాపై ఉక్కుపాదం మోపబోతున్నాం. నిత్యం నిఘా పెట్టి రూట్‌వాచ్ చేస్తూ పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నాం. దొరికిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రెండోసారి దొరికితే బైండోవర్ చేసి జరిమానా కట్టిస్తున్నాం. పీడీ యాక్టు కూడా నమోదు చేస్తున్నాం. నిందితులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.
– కృష్ణయ్య, ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట

అడవులే అడ్డా..

ఎక్సైజ్ అధికారుల దాడుల నుంచి తప్పించుకునేందుకు గుడుంబా తయారీ అడ్డాను అడవుల్లోకి మార్చేశారు. గ్రామానికి సమీపంలో ఎవరూ వెళ్లలేని ప్రాంతాల్లో తయారుచేస్తున్నారు. పగలంతా కాచిన సారాను రాత్రి ఇంటికి తెచ్చి, అనంతరం విక్రయిస్తున్నారు.

ఊరూరా జాతర..

మద్యం ధరలు అమాంతం పెరిగిపోవడంతో చుక్క లేనిదే కంటిమీద కునుకుపట్టని మందుబాబులు గుడుంబాను తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకున్న తయారీదారులు రోజురోజుకూ గుడుంబా తయారీని పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో దుకాణాలకు గుడుంబా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకసీసా రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఎక్సైజ్ నిఘా ఉండడంతో గుడుంబా వ్యాపారం అంతా ఫోన్‌కాల్ మీద ఆధారపడి కొనసాగుతోంది.

ఇథనాల్ కంపెనీ వద్దంటూ నిరసన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మరికల్: జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీటిని అనుమతి లేకుండా ఇథనాల్ కంపెనీ తీసుకెళ్తుందని, ఈ కంపెనీ తమకు వద్దంటూ నాలుగు గ్రామాల ప్రజలు శనివారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఆందోళనకు వస్తున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. దీంతో పోలీసుల, గ్రామస్తుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీకి పని చెప్పడంతో పలువురికి గాయాలయ్యాయి. మరింత ఆగ్రహంతో చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, రాంపూర్, కన్మనూర్, జిన్నారం గ్రామస్తులు కంపెనీకి వ్యతిరేకంగా ఎక్లాస్‌పూర్ స్టేజి వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులు వచ్చే వరకు రాస్తారోకను విరమించేది లేదని మొండికేశారు. రైతులకు వచ్చే నీటిని అక్రమంగా కంపెనీకి తరలించవద్దని అడ్డుకుంటే తమపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని గ్రామస్తులు ప్రశ్నించారు. కంపెనీ వల్ల దాదాపు 50 గ్రామాలకు ముప్పు ఉందని, గతేడాది నుంచి ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదన్నారు. తమపై పెట్టిన అక్రమ కేసులు తొలగించి, కంపెనీ పనులు పూర్తిగా నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రామ్‌కోటి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారుల డిమాండ్లను తెలుసుకొని వారిని శాంతిపజేశారు.

పోలీసుల దౌర్జన్యం తగదు

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజలపై కేసులు పెట్టి నిర్బంధించడం తగదని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు జీవన్‌కుమార్, వసంత లక్ష్మి అన్నారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలన్నారు. ప్రజల అభిప్రాయల మేరకు కంపెనీ రద్దు చేయలన్నారు. సమావేశంలో బాలరాజు, రోహిత్, సంధ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

మట్టి టిప్పర్, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్, 4ఇసుక ట్రాక్టర్లను శనివారం మధ్యాహ్నం ఆర్డీఓ ఆదేశాల మేరకు వీఆర్ఏలు పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మండల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని డీటీ సరస్వతీ తెలిపారు. టిప్పర్‌ను అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం వద్దకు పంపినట్లు తెలిపారు. ఉప్పునుంతల శివారులోని కేఎల్ఐ కాల్వ వెంట మట్టిని కొన్ని నెలలుగా వ్యాపారులు అచ్చంపేటకు టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరుగేషన్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. మండలంలోని మొల్గర, సదగోడు సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు ప్రతి రోజు నడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు.



పట్టుబడిన మట్టి టిప్పరు, ఇసుక ట్రాక్టర్లు

ఆకస్మికంగా రైతు మృతి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో వ్యవసాయ పొలంలో ఎరువులు చల్లడానికి వెళ్లిన రైతు ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన బండారి బుచ్చన్న(59) శనివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలంలోని కరిగెటలో ఎరువులు చల్లడానికి వెళ్లాడు. పొలం వద్దనే బహిర్భూమికి వెళ్లిన బుచ్చన్న కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత పెద్ద కుమారుడు కురుమూర్తి ఎరువులను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. కుప్పకూలిన తండ్రిని చూసి వెంటనే కొత్తకోటలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కుర్మక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లిన రైతు విగతజీవిగా ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీరని విషాదంలో మునిగిపోయారు.

నల్లమలలో యురేనియం కలకలం



నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న జిల్లా వాటర్ లెవలింగ్ అధికారి రమాదేవి

- బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు



తిర్మలాపూర్(బీకే)లో బోరు డ్రిల్లింగ్ చేస్తున్న బోరు వాహనం

అమ్రాబాద్: నల్లమలలో మరోసారి యురేనియం కలకలం రేగింది. యురేనియం తవ్వకాలు, అన్వేషణకు వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ బోరు డ్రిల్లింగ్ సమయంలో మట్టి నమూనా సేకరణ చేస్తుండడంతో బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. శనివారం ఉదయం మండలంలోని తిర్మలాపూర్(బీకే) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మహారాష్ట్రకు చెందిన బోరు వాహనంతో డ్రిల్లింగ్ పనులు మొదలు పెట్టారు. ప్రతి మీటర్‌కు ఒకసారి మట్టి నమూనాలు కవర్లల్లో సేకరిస్తుండటంతో అనుమానం చెందిన గ్రామస్తులు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తోడు కావడంతో పనులు నిలిపి వేశారు. విషయం తెలుసుకున్న వాటర్ లెవలింగ్ జిల్లా అధికారి రమాదేవి గ్రామానికి చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 17వాటర్‌షెడ్ పథకాలు ఉన్నాయని నేషనల్ వాటర్ లెవలింగ్ అథారిటీ సూచనల మేరకు భూఅంతర్భాగం పొరల్లో నీటి శాతాన్ని తెలుసుకునేందుకు బోరు వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటికే కల్వకుర్తి, వెల్దండ, చారగొండ తదితర మండలాల్లో 28బోర్లు వేసినట్లు వివరించారు. అయినా స్థానిక ప్రజలు వినలేదు. దీంతో డ్రిల్లింగ్‌ను పూడ్చివేసి బోరు వాహనాన్ని అక్కడి నుంచి పంపించారు.

యురేనియంపై ఆందోళన

2009 సంవత్సరం నుంచి పరిశీలించిన యురేనియం సర్వే ఆఫ్ ఇండియా అధికారులు 2011లో తిర్మలాపూర్(బీకే) గ్రామంలోనే 12బోర్లు వేసి మట్టి నమూనాలు సేకరించారు. ఈ ప్రాంత ప్రజలు బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకొని ఆపేశారు. తిరిగి మరోమారు డ్రిల్లింగ్ చేసి మట్టి నమూనాలు సేకరిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాల తీరు చూస్తే యురేనియం అన్వేషణ చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్త మవుతున్నాయని నల్లమల యురేనియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ నాసరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు యురేనియం తవ్వకాలకు ముందుకొస్తే అడ్డుకొని తీరుతామని నల్లమల అడవి, కృష్ణ జలాలను కాపాడుతామని తెలిపారు.

బండలాగుడు పోటీల అడ్డగింత



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి

గట్టు: మండలంలోని ఆలూరులో ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను పోలీసులు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. జాతర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు క్రికెట్ టోర్నమెంట్, బీజేపీ నాయకులు బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 17 జతల ఎద్దులు ఆలూరుకు చేరుకున్నాయి. అయితే శనివారం పోటీలను ప్రారంభించే క్రమంలో గట్టు ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో వచ్చి బండలాగుడు పోటీలు ఆపాలని కోరారు. దీంతో బీజేపీ నాయకులు గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడికి పోటీలను ప్రారంభించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు మరోసారి అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్దేశ పూర్వకంగానే బండలాగుడు పోటీలను అడ్డుకున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ బండలాగుడు పోటీలు నిర్వహించే స్థలం కోర్టు వివాదంలో ఉన్నందున అభ్యంతరం చెప్పామని, అనుమతులు తీసుకుని మరోచోట నిర్వహించుకుంటే తమకెలాంటి అభ్యంతరం చెప్పారు. మొత్తంగా బండలాగుడు పోటీలు నిర్వహించకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దుల యజమానులు నిరాశతో వెనుదిరిగారు.

పత్తి పంట తొలగించుకోండి



కోత కోసిన పత్తి పంట

అలంపూర్: బీటీ సాంకేతిక పరిజ్ఞానం రాక ముందు పత్తిని వివిధ రకాల కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరిచాయి. 2002లో వచ్చిన బీటీ సాంకేతిక పరిజ్ఞానంతో కాయ తొలుచు పురుగుల ఉధృతి తగ్గిందని ఏడీఏ సక్రీయ నాయక్ తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు పూర్తి కావడంతో పొలాల్లో పంటను తొలగించాలని సూచించారు. పత్తి పంట తొలగించిన తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు వివరించారు.

గులాబీ పురుగు

గులాబీ రంగు తల్లి పురుగు లేత ఆకుల కింది భాగాన లేత కొమ్మలపై, పూమొగ్గలపైన, లేత కాయాలపైన గుడ్లను విడివిడిగా 150 నుంచి 200 వరకు పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన పిల్ల పురుగులు పూ మొగ్గలోకి తొలుచుకొని పోయి లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలకు కనిపించనంత చిన్న రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. తర్వాత కాయలకు చేసిన రంధ్రాలు పూడిపోయి పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతినడమే కాకుండా దూది బరువు తగ్గుతుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడపడం వలన కాయ పగిలిన తర్వాతనే నష్టాన్ని గుర్తించగలం. పురుగులు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి.

నివారణ చర్యలు

సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించి గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ప్రధానంగా పంట తీసిన తర్వాత పంట లేని సమయాన, విత్తడానికి ముందు, పంట కాలంలో వివిధ చర్యలు చేపట్టాలి.

పంట తీసిన తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలు, మేకలు, పశువులను మేపాలి. పత్తి మోళ్లను ట్రాక్టర్ రోటోవేటర్‌తో భూమిలో కలియ దున్నాలి. నీటి వసతి ఉన్నప్పటికి పత్తిని 6నెలలు మించి పొడగించకుండా తీసి వేయాలి. పంట కాలం పొడగించుట ద్వారా రాబోయే పంటలో పురుగు ఉధృతి పంట తొలి దశలోనే ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. నీటి వసతి ఉన్న చోట రెండవ పంటగా ఆరుతడి పంటల్ని సాగు చేసుకోవాలి. పత్తి మోళ్లను ఇళ్ల వద్ద పొయ్యిలో వాడేందుకు నిల్వ చేయకూడదు. పత్తి తీసిన తర్వాత ఎండిన మోళ్లను విచ్చుకోని కాయలను భూమిలో కలియ దున్నుట ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చును.

పంట లేని సమయాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

ఎండాకాలంలో లోతు దుక్కులు చేసుకోనుట ద్వారా పురుగు యొక్క కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చు. గులాబీ రంగు ఆశించిన పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చిన విత్తనాలను నిల్వ చేయకుండా నాశనం చేయాలి. లేకుంటే తర్వాత పంట కాలంలో దీని ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. గులాబీ రంగు ఆశించిన పత్తిని రైతుల ఇళ్ల వద్దగాని లేదా జిన్నింగ్ మిల్లుల వద్దగాని నిల్వ ఉంచరాదు.

పత్తి విత్తడానికి ముందు, పంట కాలంలో..

పంట మార్పిడి పద్ధతిని రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. తక్కువ కాల పరిమితిగల రకాలను ఎంపిక చేసుకుని సకాలంలో విత్తుకోవడం ద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. బీటీ పత్తి విత్తే సమయాల్లో చుట్టూ 5 వరుసల్లో నాన్ బీటీ పత్తిని విధిగా విత్తుకోవాలి. పత్తి పొలం, చేను చుట్టూ తుత్తురు బెండలాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పత్తి పంట దగ్గరలో బెండ పంట ఉండరాదు. పత్తి పంట విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి వరుసగా బుట్టలలో మూడు రోజులు 7 లేదా 8 తల్లి పురుగులు పడటం గమనిస్తే, 10 శాతం గుడ్డి పువ్వులు లేదా 10 శాతం పురుగు ఆశించిన కాయలను గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే నివారణకు మందులు పిచుకారి చేసుకోవాలి. 5 శాతం వేప గింజల కషాయం లేదా 5 మి.లీ (1,500 పీపీఎం) వేప నూనెను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. క్వినాల్‌ఫాస్ 2.0 లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా కోరోఫైరిఫాస్ 2.5. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పంట కాలంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్‌మెత్రిన్ 25 శాతం ఇ.సీ ఒక మి.లీ లేదా లామ్డాసైహాలోత్రిన్ 5 శాతం ఇ.సి 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పత్తి పంటపై ఎక్కువ సార్లు పిచికారి చేసినట్లయితే రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గ్రంథాలయానికి నూతన పుస్తకాలు



మరికల్: మండల గ్రంథాలయానికి కాంపిటీషన్స్‌కు సంబంధించిన నూతన పుస్తకాలను చైర్మన్ సురేష్‌బాబు అందజేశారు. శనివారం మరికల్ గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథపాలకుడు మల్లికార్జున్ వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త పుస్తకాలను ఉద్యోగార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ, యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, రాజేష్, శ్రీను, శేఖర్, నవీన్‌లు పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

మక్తల్: పట్టణంలో విద్యుదాఘాతం వల్ల ఓ పెంకుటిల్లు దగ్ధం మైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలావున్నాయి. మక్తల్ మండలం జౌళాపురం గ్రామానికి చెందిన కావాలి శేఖర్ ఇంట్లో విద్యుదాఘాతం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. శేఖర్ పొలానికి వెళ్లారు. దీంతో చుట్టూ పక్కల వారు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చే సరికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. రూ. 35 వేల నగదు, రెండు తులాల బంగారు, వెండి గొలుసులు, పాస్ పుస్తకాలు, బట్టలు, ధ్యాన్యం పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతాప్ రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి శేఖర్‌తో మాట్లాడారు. ప్రభుత్వం ఆయనను ఆదుకోవాలని కోరారు.

నూతన అధ్యక్షుడిగా వెంకటేష్

ధన్వాడ: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ నూతన అధ్యక్షుడిగా ఎలిగండ్ల వెంకటేష్ నియమితులు అయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన నూతన కమిటీ ఎన్నికలో ఎలిగండ్ల వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట: కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చూపారు. ఈనెల 5, 6 తేదీల్లో పాలమూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన అంతర్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీల్లో కోస్గి కళాశాలకు చెందిన ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. ఈమేరకు శనివారం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు.

పెద్దతిప్ప మైనింగ్ పనుల పరిశీలన

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం గ్రామ సమీపంలో ఉన్న పెద్ద తిప్ప గుట్టకు కొనసాగుతున్న మైనింగ్ పనులను శనివారం మైనింగ్ అధికారులు భరణి, సుజాత, తహసీల్దార్ సువర్ణరాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతుల మేరకు పనులు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్యల తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'పై అవగాహన

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈమేరకు సంక్రాంతి పర్వదినం అనంతరం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనుందని తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నుంచి ఆపై వయస్సు ఉన్నవారికి కంటి వెలుగుపై అవగాహన కల్పించి, వారు శిబిరాలకు వచ్చే విధంగా వార్డు కౌన్సిలర్లు చొరవ చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోమారు కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు కంటిచూపులో ఉండే లోపాలను గుర్తించి నాణ్యమైన వైద్యం అందించనుందని పేర్కొన్నారు.

బ్యాగుల అందజేత

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ వెంకటయ్య బ్యాగులు, పెన్నులు, నోట్‌పుస్తకాలు అందజేశారు. మొత్తం 120 మంది విద్యార్థులకు తమ మనువరాలు శ్లోకశ్రీ పుట్టినరోజును పురస్కరించుకుని వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సర్పంచ్ జయప్రద, కాంప్లెక్స్ హెచ్ఎం నర్సిములు, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, చెన్నప్ప పాల్గొన్నారు.

రోడ్డుపైనే నీటిగుంతలు

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పట్టణంలో సత్యసాయి కాలనీలో రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంతలు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని ఆయా కాలనీల్లో రోడ్లను అక్రమంగా కబ్జా చేసి నీటి కోసం నిర్మించిన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో రోడ్లను అక్రమించి నీటి గుంతలను ఏర్పాటు చేసుకోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించే అధికారులు కాలనీలో రోడ్లపై నీటి గుంతలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సత్యసాయి కాలనీ, బ్రాహ్మణ్‌వాడీ, సింగార్‌బేస్, ధూల్‌పేట రోడ్, సివిల్‌లైన్, హజిఖాన్‌పేట తదితర కాలనీలలో గుంతల వల్ల రోడ్లు ఇరుకుగా మారాయని చెబుతున్నారు. పట్టణంలోని ఎత్తైన ప్రాంతాలలో నీటి సరఫరా సరిగా లేదనే సాకుతో రోడ్లను ఆక్రమించుకొని నీటిగుంతలను తవ్వుకొని నల్లా కనెక్షన్ తీసుకున్నారని, రోడ్ల పక్కనే నిర్మించుకున్నారని చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భగీరథ పనులు పూర్తిచేసి పూడ్చివేస్తాం

పట్టణంలోని ఆయాకాలనీలో ఉన్న ప్రమాదకర నీటి గుంతలను పరిశీలిస్తాం. మిషన్ భగీరథ పనులు పూర్తి అయిన వెంటనే అక్రమంగా రోడ్లపై నిర్మించిన నీటి గుంతలను పూడ్చి వేయించి రోడ్డు విశాలంగా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.
సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

గాయపడుతున్నా పట్టించుకోరా?



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న గుంత

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పాత పంచాయతీ భవనం దగ్గర ఉన్న గుంత విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులు తరచూ గాయాల పాలవుతున్నారు. శనివారం ఓ విద్యార్థి పళ్లు విరగ్గొట్టుకున్నాడని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు ఆడుకునే సమయంలో ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. కాగా గుంత విషయం గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయంపై పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రను వివరణ కోరగా విషయం తమ దృష్టికి రాలేదని, వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

10న టాలెంట్ టెస్టు

మాగనూర్: భారతీయ విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 10న పదవతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నాట్లు జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న నర్సింహ అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సత్తాచాటాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3వేలు షీల్డ్, ద్వితీయ బహుమతి రూ. 2వేలు షీల్డ్, తృతీయ బహుమతి రూ. 1000 షీల్డ్ లతో పాటు మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన మొదటి ఇద్దరికి బహుమతులు అందజేస్తామన్నారు.

అడ్మిషన్లకు గడువు పెంపు

మరికల్: ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ చదువుకోవాలనే వారికి ఈ నెల 13 వరకు అడ్మిషన్‌లకు అవకాశం ఉందని సెంటర్ కో ఆర్డినేటర్ చెన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం పెంచిన గడువును చదువుకు దూరమైన వారు, కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే అవకాశం లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఓపెన్ ప్రవేశాలకు సంబంధించిన మిగతా వివరాల కోసం మరికల్‌లోని ఓపెన్ స్కూల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉన్నత శిఖరాలను అందుకోవాలి



మాగనూర్‌లో బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మాగనూర్: జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచనలో ప్రతిభ కనబర్చిన వారికి శనివారం బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సుదర్శన్‌రావు చేతుల మీదుగా కార్యక్రమం జరిగింది. అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు సగరం రమేష్ విద్యార్థులు శ్రద్ధగా చదివి భవిష్యత్తులో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని అన్నారు. వారికి సంఘం తరపున అవసరమైన సహకారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొనెంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని మాగనూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు అన్నారు. మహిళా సాధికరత కార్యక్రమం శనివారం పాఠశాలలో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకాశమే హద్దుగా అమ్మాయిలు ఎదగాలన్నారు. సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రాంమ్మోహన్, సుమత, కళావతి, శోభారాణి, సంధ్య, ఫాతిమా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యదర్శిగా రాజేంద్రబాబు

కోస్గి: అమిన్‌కుంట్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజేంద్రబాబు పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం జిల్లా నాయకులు రాజేంద్రబాబుకు కార్యవర్గంలో చోటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుండుమాల్ జెడ్పీహైస్కూల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డిలు ప్రకటన చేశారు. నాయకులు రమేష్, మధుసూదన్, ప్రకాష్‌గౌడ్, అనంతయ్య, నర్సింలు, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రవికుమార్, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు రాజేంద్రబాబును అభినందించారు.

మాలాధారణతో క్రమశిక్షణ

నారాయణపేట టౌన్ : పట్టణంలో అయ్యప్పమాల ధరించి 18వ పాదం పూర్తి చేసుకున్న గురు స్వామి జంగిటి వెంకటేష్‌ను వార్డు కౌన్సిలర్ గురులింగప్ప శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అధ్యాత్మిక భక్తి సన్మార్గానికి అయ్యప్ప దీక్ష చేయడం ఎంతో మంచిదన్నారు. ఉపవాస దీక్షలను కఠినంగా చేపడుతూ, నిత్యం స్వామివారి నామస్మరణలో పూజలు చేయడం చాలా విశేషమని అన్నారు. మాలాధారణతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి అవడుతాయన్నారు. కార్యక్రమంలో గురుస్వామి కాకర్ల భీమయ్య, సాయి కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తోట్ల భీమయ్య, నక్కకిష్టయ్య, అట్టు, నారాయణ, అంజి స్వామి, రాము, నాగరాజ్, సుధాకర్ స్వామి, కన్నయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

9న ఐసీఐసీఐ బ్యాంకు ఇంటర్వ్యూలు

నారాయణపేట రూరల్ : ది టైమ్స్ ప్రో వారి సహకారంతో శాశ్వత ప్రాతిపదికన ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగ కల్పనకు సోమవారం సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ, బీటెక్‌లో 50శాతం మార్కులు సాధించి 1997–2003 మధ్యలో జన్మించిన వారికి అవకాశం ఉంటుందన్నారు. రూ.20వేలు జీతం అందుకునే అవకాశం ఉందని, అర్హత కల్గిన వారు సోమవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

అంగన్ వాడీ టీచర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నారాయణపేట టౌన్ : మండల పరిధిలోని జిలాల్‌పూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న అమ్ములమ్మ గుండెపోటుతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ బాల్‌రాం డిమాండ్ చేశారు. జిలాల్‌పూర్‌కు వెళ్లి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. పని ఒత్తిడి తట్టుకోలేకనే గుండెపోటు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలకు రూ.25 వేలు అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు.

నారాయణపేట రూరల్ : అంగన్‌వాడీ టీచర్ కర్నె అనులమ్మ మృతికి శనివారం గ్రామ సర్పంచ్ తిరుపతమ్మ, ఎంపీటీసీ సుభద్రమ్మ, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి, మాజీ సర్పంచ్ శివప్ప, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్యాలయ ముట్టడి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

- తాగునీటి కోసం ధర్నా చేపట్టిన కాలనీల ప్రజలు
- మూడు నెలలుగా ఇబ్బందులు
- 3 రోజుల్లో సమస్య తీరుస్తామన్న మున్సిపల్ కమిషనర్

మక్తల్: పట్టణంలోని బీసీకాలనీ 5 వవార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించడంలేదని స్థానికులు మున్సిపల్ కార్యాలయాన్ని కౌన్సిలర్ మొగులప్ప ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీల్లో తాగునీటి పరిష్కారం చేయాలని కమిషనర్లకు తెలియజేసినా ఫలితం లేకుండా పోతోందని అన్నారు. పైప్‌లైన్ కనెక్షన్ లేదని, తాగునీటి బోరుకు మోటర్ కొనుగోలు చేయాలని కమిషనర్‌కు ప్రొసిడింగ్ అందజేసినా చైర్‌పర్సన్ , వైస్‌చైర్మన్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు.మూడు నెలల నుంచి మోటర్ కాలిపోవడంతో తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మంజూరైన మోటర్‌ను వెంటనే బిగించాలని డిమాండ్ చేశారు. కార్యాలయం ముందు కాలనీ వాసులు ధర్నా చేస్తున్న సమాచారం తెలుసుకొన్న కమిషనర్ మల్లికార్జున్ 3 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న సుభాష్‌చంద్రజీ



చెక్కులు అందిస్తున్న కాంతారావు

మక్తల్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకుడు మక్తల్ నియోజకవర్గ ప్రబారి సుభాష్‌చంద్రజీ అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలో శ్రీవేంకటేశ్వర పంక్షన్ హాల్‌లో బూత్ కమిటీల సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. జిల్లా ఇన్‌చార్జ్ పూ నమ్‌చంద్ లాహోటి, రేచింతల శ్రీనివాస్, ప్రసన్నరెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కిరణ తిమ్మప్ప, జిల్లా కార్యదర్శి అశోక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ కాంతారావు, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందునామాజీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ధన్వాడ మండలం కంసాన్‌పల్లి అమ్మన్నకు రూ.12వేలు, మరికల్ మండల అప్పంపల్లి రవికి రూ.45 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రామచంద్రయ్య, ఉదయ్ భాను, గోవర్ధన్ గౌడ్, సురేందర్, పాల్గొన్నారు.

మరికల్: రాష్ట్రాన్ని కేసీఆర్ ఓ నియంతలా పాలిస్తున్నాడని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పాలక కాంతారావు అన్నారు. మండలంలోని పెద్దచింతకుంటలో శనివారం పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేసిన మోసాలను ప్రజలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు బూత్‌స్థాయిలో వివరలించి అవగాహన కల్పించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో కేసీఆర్ పతనం తప్పదన్నారు. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో అప్పంపల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, శ్రీరామ్, జగదీశ్‌లు పాల్గొన్నారు.

'సమాజ సేవే లక్ష్యం'



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: సమాజ సేవే వీజేఆర్ ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. కళాశాలలో సమస్యలను విద్యార్థులు తమ దృష్టికి తేవడంతో ఏర్పాట్లు చేశామని వివరించారు. విద్యార్థులు పట్టు దలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా కోరారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు సాయం చేయడానికి ఎల్లవేళలా ముందుంటామని హామీ ఇచ్చారు. రూ. 65 వేలు విలువచేసే మంచినీటి ట్యాంకు, అదేవిధంగా మరుగుదొడ్లకు పైప్‌లైన్‌లు, కుళాయిలు వేయించి సమస్యలు పరిష్కరించిన ఆయనను ఈ సందర్భంగా సన్మానించారు. ప్రిన్సిపల్ మురళీధర్‌చారీ, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామంలో శనివారం నిర్వహించిన ధార్మిక సమావేశానికి హాజరైన వర్కటం జగన్నాథ్ రెడ్డి కాశీ జగత్ గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. ఈ ప్రాంతానికి జగత్ గురువులు రావడం మహా అదృష్టమని అన్నారు.

పారిశుద్ధ్య పనులు చేయించడం తగదు



నీటివిభాగం కార్మికులతో మాట్లాడుతున్న బాల్‌రాం

నారాయణపేట టౌన్ : మున్సిపాలిటీలో నీటి విభాగంలో పనిచేస్తున్న కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించడం తగదని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం అన్నారు. జిల్లా కేంద్రంలో డివైడర్‌పై మొక్కల దగ్గర చెత్త చెత్తదారం తొలగించడంతో పాటు మొక్కల కాడల దగ్గర నీటి నిల్వ ఉండేందుకు గుంతలు ఏర్పాటు చేయడం తదితర పనులు చేస్తున్న నీటి విభాగం కార్మికులను శనివారం పలకరించి మాట్లాడారు. మున్సిపల్ అధికారులు ఈ రకమైన పనులు చెప్పడం భావ్యం కాదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇతర పనులు అప్పజెప్పొద్దని తెలిపారు. ఇప్పటికే కార్మికులు ఎలాంటి సెలవులు లేకుండా, తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యం



దామరగిద్దలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

దామరగిద్ద: గ్రామీణ క్రీడాకారులను గుర్తించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం పల్లె ప్రగతి క్రీడలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ నర్సప్ప, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ ఆశమ్మలు ఎంఈఓ వెంకటయ్యలు అన్నారు. పల్లె ప్రగతి క్రీడల్లో భాగంగా శనివారం మండలంలోని దామరగిద్ద జెడ్పీఉన్నత పాఠశాలల్లో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 13 వరకు క్రీడల పోటీలు కొనసాగుతాయన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు లోపు యువతి యువకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఎచ్ఎం జ్యోతి, పీఈటీలు వెంకటప్ప రామకృష్ణ, కతలప్ప, రవి, ఉపాధ్యాయులు శంభులింగం, పంచాయతీ కార్యదర్శి రాజయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే సహకార కేంద్రాల ధ్యేయం



రుణాలను చెల్లిస్తున్న రైతులు

నర్వ: రైతుల ఆర్థికాభివృద్ధి కోసమే ప్రాథమిక సహకార కేంద్రాలు ఉన్నాయని నర్వ పీఏసీఎస్ చైర్మెన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ద్వారా తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు వడ్డీ మాఫీతో కట్టి వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రుణాలను తీసుకున్న రైతులు తమ అప్పును తీర్చేందుకు ముందుకు వచ్చి చెల్లించిన వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు రామేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ గోపాల్‌గౌడ్, కన్మనూర్ గ్రామ పెద్దలు ప్రతాప్‌రెడ్డి, రైతులు శివరాజు, గోవిందు, లక్ష్మయ్య, గంగాధర్, ఉందేకోడ్ రైతులు నెల్లురి వెంకటయ్య, తదితరులున్నారు.

శబరిమలకు తరలిన మాలధారులు

నారాయణపేట టౌన్ : పట్టణ సమీపంలోని వల్లంపల్లి శివారులో వెలసిన శబరి పీఠం సన్నిధానంలో గురుస్వాముల ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి మాలధారులు ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. అంతకుముందు శబరిపీఠం సన్నిధానంలో గురు స్వాములు కాకర్ల భీమయ్య భక్తి గీతాలను అలపిస్తూ అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, జల,ఫల, ఆవునెయ్యితో అభిషేకం చేపట్టారు. అనంతరం 18 మెట్ల పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 18 మెట్లపై కర్పూర హారతి చేశారు. స్వాములకు అన్నదానం నిర్వహించారు. మూడు నెలల పాటు దీక్షలను నియామనిష్టలతో చేపట్టిన 183 మంది స్వాములు, అయ్యప్పస్వామి నామస్మరణల మధ్య ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



ఇరుముడితో శబరిమలకు తరలివెళ్తున్న అయ్యప్ప స్వాములు

క్లుప్తంగా...

మార్చి 5న ఏఈ అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఫిబ్రవరి 12వ తేదీన జరగాల్సిన అర్హత పరీక్షను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఆ రోజు గేట్ పరీక్షలు జరగనున్నట్లు అభ్యర్థులు విన్నవించడంతో పరీక్ష తేదీని వాయిదా వేయాలని కమిషన్ నిర్ణయించింది. మార్చి 5వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.

టీచింగ్ సిబ్బందిని నేరుగా నియమించండి

ఆయుర్వేద వైద్య కళాశాలపై కేసులో సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బోధనేతర సిబ్బందిని టీచింగ్ పోస్టుల్లో భర్తీ చేయడాన్ని ఆపాలని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆయుర్వేద వైద్య సర్వీసుల నిబంధనలను మారుస్తూ ఖాళీ పోస్టులను నేరుగా భర్తీ చేయకుండా..అంతర్గత బదిలీలు చేయడాన్ని ఆపాలని కోరుతూ వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ నీలిమాతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 18 ఏళ్లుగా ఆయుర్వేద కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శితో పాటు మరో 17 మందిని ప్రతివాదులుగా చేర్చారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం..నాన్ టీచింగ్ కేడర్ ఉద్యోగులను టీచింగ్‌లో భర్తీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌ను సస్పెన్షన్‌లో పెట్టిన ధర్మాసనం..నేరుగా భర్తీ చేయాలని సూచించింది.

జేఎల్ నోటిఫికేషన్‌లో వయో పరిమితి పెంచండి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ లెక్చరర్ (జేఎల్) నియామకపు నోటిఫికేషన్‌లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు వయో పరిమితి 52 ఏళ్లకు పెంచాలని తెలంగాణ (కాకతీయ) ప్రైవేటు కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా జేఎల్ నోటిఫికేషన్ లేకపోవడంతో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం చూస్తున్నారని, ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేద్దామంటే వయో పరిమితి దాటిపోవడంతో నోటిఫికేషన్ అర్హత సాధించలేకపోతున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

వెండి చీరను ఆవిష్కరించిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల నేత కళాకారుడు నల్లా విజయ్ మగ్గంపై నేసిన సువాసనలు వెదజల్లే వెండి చీరలను మంత్రి తారక రామారావు శనివారం ఆవిష్కరించారు. చీర తయారీకి దాదాపు నెలన్నర రోజుల సమయం పట్టిందని విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఇప్పటి వరకు విజయ్ నేసిన వస్త్ర ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అతని కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. తెలంగాణ నేతన్నల అనితర సాధ్యమైన, అద్భుతమైన ప్రతిభకు విజయ్ నిదర్శనమని, ఆయన సిరిసిల్లకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయ్‌కు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.



నల్లా విజయ్ మగ్గంపై నేసిన వెండి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఇక్కడ డిపాజిట్ల కంటే రుణాలు ఎక్కువ

- తెలంగాణలో బ్యాంకుల పనితీరు భేష్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- కేంద్ర పథకాలతో పేదల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం
- వివిధ వర్గాలకు బ్యాంకుల నుంచి విస్తృతంగా ఆర్థిక సాయం
- ప్రధాని మోదీ ఆలోచనలతో డిజిటల్‌ఇండియా
- రాష్ట్ర ప్రభుత్వం త్వరగా రైతు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయని.. డిపాజిట్ల కంటే ఎక్కువగా రుణాలు ఇవ్వడం మంచి పనితీరుకు నిదర్శనమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకుల ప్రాధాన్యం బాగా పెరిగిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కోఠి స్టేట్‌బ్యాంకులో రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలకు బ్యాంకులు లోన్లు ఎలా మంజూరు చేస్తున్నాయనే దానిపై సమీక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. దేశంలోని పేద ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంచేలా ప్రధాని మోదీ జన్‌ధన్‌ఖాతాలు తెరిపించారని, ఆ ఖాతాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు దళారుల దోపిడీ లేకుండా నేరుగా అమలవుతున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణాలు 2020–21లో రూ.40,564 కోట్లు, 2021–22లో రూ.42,853 కోట్లు ఇచ్చారని.. 2022–23లో రూ.40,718 కోట్లు లక్ష్యంకాగా.. ఇప్పటివరకు 58.43 శాతం రుణాలు ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా వ్యవసాయ రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు సహకరించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.



ఇక్కడ బ్యాంకుల క్రెడిట్ రేషియో ఎక్కువ

రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.6,32,834 కోట్ల డిపాజిట్లు ఉంటే.. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా డిపాజిట్ల కన్నా ఎక్కువగా రూ.7,25,568 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణ క్రెడిట్, డిపాజిట్‌రేషియో దేశంలోనే ఎక్కువగా 114.65 శాతంగా ఉందని తెలిపారు. ఇది బ్యాంకుల పనితీరుకు అద్దం పడుతోందని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో రాష్ట్రంలోని అన్ని బ్యాంకులు ఆయా ప్రాధాన్య రంగాలకు రూ.84,143 కోట్ల రుణాలు ఇచ్చాయని.. అందులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.38,737 కోట్లు మంజూరు చేశాయని వివరించారు. ప్రధాన మంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్‌జనరేషన్‌ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), పీఎం స్వానిధి పథకాల కింద ఆయా వర్గాలకు బ్యాంకుల నుంచి గణనీయంగా ఆర్థిక సాయం అందినట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. వీధి వ్యాపారులకు పెద్ద ఎత్తున కేంద్ర సాయం అందించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద బ్యాంకులు 62,516 గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశాయని, లబ్ధిదారులు రూ.1,427.72 కోట్లు సబ్సిడీగా పొందారని చెప్పారు. కాగా.. రాష్ట్రంలో రుణమాఫీ కింద ఎంత మంది రైతులకు, ఎన్ని కోట్ల మేర లబ్ధి అందిందనే వివరాలను కిషన్‌రెడ్డి తెలుసుకున్నట్టు సమాచారం.

కొత్త మెడికల్ కాలేజీలు | త్వరగా పూర్తి కావాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- 13 డయాగ్నొస్టిక్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి
- ఆసుపత్రులకు మందుల సరఫరాలో పరిమితి ఉండకూడదు
- వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న తొమ్మిది వైద్య కళాశాలల పనులను వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం నుంచి నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం), తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య కళాశాలల పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. గత ఏడాది 8 మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి రికార్డు సృష్టించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయనున్న కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, వికారాబాద్, జనగామ, నిర్మల్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కాలేజీల్లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ వైద్య మండలి బృందం పరిశీలనకు వచ్చేనాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు.

మాతా, శిశు కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలి..

నిర్మాణంలో ఉన్న మాతా, శిశు సంరక్షణ కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నిమ్స్, గాంధీ ఆసుపత్రుల ఆవరణల్లో నిర్మిస్తున్న మాతా, శిశు కేంద్రాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 13 తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను వీలైనంత వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చురీల పనులు, 12 సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌ల పనులను కూడా మంత్రి సమీక్షించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల సమీపంలో తొమ్మిది క్రిటికల్ కేర్ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా, అన్ని ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. మందుల సరఫరాలో ఎలాంటి నియంత్రణ ఉండవద్దని, అవసరమైన మేరకు మందులను ఆయా ఆసుపత్రులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, 24 గంటల్లోగా పరీక్ష ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూసుకోవడం సూపరింటెండెంట్ల బాధ్యత అని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ వైద్య పరికరాలు సమకూర్చుతోందని, ఈ నేపథ్యంలో అవి ప్రజలకు పూర్తిస్థాయిలో సద్వినియోగపడేలా చూడాలని చెప్పారు.

'సెట్' కన్వీనర్లను ఖరారు చేసిన టీఎస్‌సీహెచ్‌ఈ!

- ఎంసెట్ నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూకు... కన్వీనర్‌గా బి.డీన్‌కుమార్
- మొత్తం ఏడు సెట్‌లకు కన్వీనర్ల ఎంపిక పూర్తి

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం (2023–24)లో వృత్తి విద్యా కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించే సాధారణ ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణ బాధ్యతలు, కన్వీనర్ల ఎంపిక ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్తి చేసింది. ప్రధానంగా ఏడు రకాల సెట్లకు సంబంధించి యూనివర్సిటీలు, కన్వీనర్ల ఎంపికపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించారు. టీఎస్‌ఎంసెట్‌ను జేఎన్టీయూ నిర్వహించనుండగా... కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి.డీన్‌కుమార్ నియమితులయ్యారు.

వీటితో పాటు మరో ఆరు సెట్లకు కన్వీనర్ల జాబితాను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస రావు ప్రకటించారు.

సెట్-23	యూనివర్సిటీ	కన్వీనర్
టీఎస్ ఎంసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.డీన్‌కుమార్
టీఎస్ పీజీఈసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.రవీందర్‌రెడ్డి
టీఎస్‌ఐసెట్	కేయూ	పి.వరలక్ష్మి
టీఎస్‌ఈసెట్	ఓయూ	శ్రీరాం వెంకటేశ్
టీఎస్‌లాసెట్,పీజీఎల్‌సెట్	ఓయూ	బి.విజయలక్ష్మి
టీఎస్ ఎడ్‌సెట్	ఎంజీయూ	ఏ.రామకృష్ణ
టీఎస్ పీఈసెట్	శాతవాహన	రాజేశ్ కుమార్



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల | నిర్మాణాలకు టెండర్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాల ప్రక్రియ మరో అడుగు ముందుకు పడింది. ఈ ఆస్పత్రుల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఎల్‌బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో నిర్మించే మూడు ఆస్పత్రులకు నిర్మాణ సంస్థలను ఎంపిక చేసింది. ఈ మూడు ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2,679 కోట్లు అంచనా వేసింది. ఈమేరకు టెండర్లు పిలవగా....రూ.2,004 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టు సంస్థలు ధరలు ప్రకటించాయి. అత్యంత తక్కువ ధరలు ప్రకటించిన సంస్థలకు ప్రభుత్వం నిర్మాణ బాధ్యతలు అప్పగించనుంది.

ప్రాజెక్టు	ప్రభుత్వ అంచనా	కాంట్రాక్టు సంస్థ	నిర్మాణ వ్యయం
టీఐఎంఎస్ ఎల్‌బీనగర్, రంగారెడ్డి జిల్లా	900.00 కోట్లు	లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్	668 కోట్లు
టీఐఎంఎస్ సనత్‌నగర్, హైదరాబాద్ జిల్లా	882.00 కోట్లు	మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా	667 కోట్లు
టీఐఎంఎస్ అల్వాల్, మేడ్చల్ జిల్లా	897.00 కోట్లు	డీఈసీ ఇన్‌ఫ్రా	669 కోట్లు

ఆలయాల్లో న్యాయమూర్తుల పూజలు



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం, సోమశిలలోని ఆలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి నాగార్జున్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సోమశిలలో సోమేశ్వరాలయాన్ని, సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న కాటేజీలను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ రమేష్ నాయక్, ఎస్ఐ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను శనివారం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణ్‌రావు, కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి దినేష్ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



పట్టువస్త్రాల సమర్పణ



స్టేషన్ మహబూబ్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక తిరుమలదేవుని గుట్ట వెంకటేశ్వరస్వామికి గోదా కల్యాణం కోసం శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా పట్టణంలోని పలు దేవాలయాలను నగర సంకీర్తన పూర్వకంగా వెళ్లి సందర్శిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రధాన అర్చకుడు రాఘవేంద్రశర్మ, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన అర్చక ఆగమ పరీక్షలు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

జోగుళాంబ శక్తిపీఠం: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షలు సోమవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి 359 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పరీక్షల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన సౌకర్యాలను పరీక్ష కేంద్రం దగ్గర ఏర్పాటు చేశారు. అర్చక, ప్రవేశ, వర, ప్రవరలకు సంబంధించి వివిధ ఆగమాల నుంచి అర్చకులు పరీక్షలు రాశారు. ఇందులో 40ఏళ్ల వయసు లోబడి ఉన్నవారంతా రెండు రోజులలో పేపర్–1, 2, 3 రాసి, 7వ తేదీ మధ్యాహ్నం మౌఖిక, క్రియ పరీక్షలకు హాజరయ్యారు. చాత్తద శ్రీవైష్ణవ, శైవ ఆగమం, వీరశైవ ఆగమం, పాంచరాత్ర ఆగమం, తంత్రసార ఆగమం, వైదిక స్మార్త ఆగమం, వైఖానస ఆగమం, గ్రామ దేవత ఆగమం నుంచి పరీక్షలు రాసినట్టు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్లు శకుంతల, వెంకటేశ్వరి, వీణాధరి, శ్రీనివాస్ తెలిపారు. ఇన్విజిలేటర్లు పురేందర్, రంగారావు, రంగాచారి, గ్రేడ్ –2 అధికారులు శేఖర్ గౌడ్, ఉమారాణి, సూపరింటెండెంట్ రఘునాథచారి తదితరులు ఉన్నారు.

మౌఖిక పరీక్షలతో మార్మోగిన సింహగిరి

రెండు రోజులు ఆగమ పరీక్షలలో తొలిరోజు రాత పరీక్షలు ఉండగా, మరుసటి రోజు మౌఖిక పరీక్షలు నిర్వహించడంతో ప్రశ్నలకు సమాధానంగా అర్చక స్వాములు వేదమంత్రాలను ఉచ్చరించి తమ ప్రతిభను చాటడంతో సింహగిరి ఒక్కసారిగా వేదఘోషతో మార్మోగింది.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ స్క్వాడ్

నవ్వుతో ఒత్తిడిని అధిగమిద్దాం



అంతర్జాతీయ సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి, వీసీ తదితరులు

- పీయూ అంతర్జాతీయ సదస్సులో మలేషియా అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి
- 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించిన వివిధ యూనివర్సిటీల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఒత్తిడిని అధిగమించేందుకు నవ్వు ఒక సాధనంలా ఉపయోగపడుతుందని మలేషియాలోని మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి అన్నారు. శనివారం పాలమూరు యూనివర్సిటీలో 'రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్స్– 2022' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'మానసిక ఆరోగ్యంపై నాన్- ఫార్మకోలాజిక్ ప్రభావం' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించి మాట్లాడారు. నవ్వు అనేది మనిషిలో ఒక సాధారణ జీవన విధానంలా ఉంటుందని, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఒక ఔషధంలా పని చేస్తుందన్నారు. అంతకు ముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ మనిషి పూర్తి ఆరోగ్యంగా జీవించాలంటే తప్పకుండా మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, సరైన నిద్రతో మనిషిని ఒత్తిడి, రోగాలకు దూరంగా ఉంచుతాయని పేర్కొన్నారు. అనంతరం పీయూతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పీహెచ్‌డీ స్కాలర్స్ కార్యక్రమంలో పాల్గొని దాదాపు 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు పీయూలో మూడు భవనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహాత్మగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి, చిన్నప్పరెడ్డి, గురుదీప్‌సింగ్, నీరజ్‌జైన్ లక్నో యూనివర్సిటీ, పీయూ రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పిండి పవన్‌కుమార్, ఓయూ పీడీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయం



మాట్లాడుతున్న కాశి జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి

కృష్ణా: భారతదేశం అంటేనే సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమని కాశీ జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి అన్నారు. శనివారం మండలంలోని చేగుంటలో నిర్వహించిన జన జాగృతి ధర్మ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు అక్కడి పార్వతీ పరమేశ్వర ఆలయంలో 18 మంది జంగమ వటులకు ఉపనయనం నిర్వహించారు. అనంతరం క్షేత్రానికి చెందిన క్షీరాలింగా మహాస్వామి వారి 63వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ధార్మిక సమావేశంలో మాట్లాడారు. మంచి సమాజం నిర్మించాలంటే మొదట ఇంట్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలకు మన సంస్కృతిని, భాషను నేర్పించాలని అన్నారు. ప్రతి వ్యక్తి తన ధర్మాన్ని పాటించాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైన శివుడు లింగ రూపంలో దర్శనమిస్తాడు కానీ, ఇక్కడ పార్వతీ పరమేశ్వరులు నిజరూపంలో ఉండడం అద్భుతమని అన్నారు. కార్యక్రమంలో శాంతమల్ల శివాచార్య మహాస్వామి, చెన్నవీర మహాస్వామి, పంచమ సిద్దలింగా మహాస్వామి, శంబు సోమనాథ మహాస్వాములు హాజరయ్యారు.



ధార్మిక సమావేశానికి హాజరైన భక్తులు

ఆర్డీఎస్ నీరు అందక అవస్థలు



ఉండవెల్లిలో ఆర్డీఎస్ కెనాల్‌లో తగ్గిన నీటిమట్టం

ఉండవెల్లి: మండలంలోని ఆర్డీఎస్ కెనాల్‌లోని డీ–34 నుంచి డీ–40 వరకు నీరు వచ్చినట్లే వచ్చి నిలిచిపోయాయి. శనివారం అలంపూర్, ఉండవెల్లి మండలాల్లోని పంటలకు నీరు వదిలారు. సాయంత్రం లోపు నీరు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల్లో మొక్కజొన్న, మిరప, మినుములు వేసిన రైతులు ఆర్డీఎస్ కాల్వలో నీరు లేక పంటలు ఎండుదశకు చేరుకున్నాయని తెలిపారు. దాదాపు 1,500 ఎకరాలకు పైగా పంటలకు నీరందించాలని, రైతులు డి. బూడిదపాడులోని ఆర్డీఎస్ అధికారులకు తెలిపినా శుక్రవారం వచ్చిరని, శనివారం సాయంత్రం వరకు నీరు వదలేదని రైతులు తెలిపారు. ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా తుంగభద్ర నదిలో నీటి స్థాయి తగ్గిందని తెలిపారు. తుమ్మిళ్ల, జూరాల నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

వారంలోగా పదోన్నతులపై ప్రకటన



భూత్పూర్‌లో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

భూత్పూర్: ఉపాధ్యాయుల పదోన్నతులకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని, వారం రోజుల్లో ప్రకటన వెలువడనుందని టీపీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమాలాకర్‌రావు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని తాటికొండ, అన్నాసాగర్, పోతులమడుగు, ఎల్కిచర్ల, కొత్త మొల్గర, పాత మొల్గర ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ గురుకుల పాఠశాలలను సందర్శించారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు టీపీఆర్టీయూ టీఎస్ కృషి చేస్తుందని సంఘం బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గుర్రం చెన్న కేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ గౌడ్, రఘురామిరెడ్డి, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,020అడుగుల వరకు నీరువచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 802 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 120, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.